

బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్

ఏపీలో నంది అవార్డులిస్తాం : దుర్గేష్





షష్ఠికి ముస్తాబు

జిల్లాలోని పలు ఆలయాలు షష్ఠికి ముస్తాబయ్యాయి. బుధవారం సుబ్రహ్మణ్యేశ్వ రుడి షష్ఠి సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.. ఉండ్రాజవరం, బిక్కవోలు, రాజమహేంద్రవరం లోని సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. బిక్కవోలులోని ఆలయం వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. 6



అక్రమాలను పట్టేస్తా..


టౌన్ ప్లానింగ్ ఏం చేస్తోంది..? ఉందా లేదా..? రాజమహేంద్రవరం నగరంలో చూస్తే పరిమితి మించిన భవనాలు ఎన్నో ఉన్నాయి.. అయినా చర్యలు మాత్రం శూన్యం.. పైకి అంతా బాగానే ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకసారి లోతుకు వెళ్లి చూస్తే అసలు విషయం బోధపడుతోంది. రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనాకు ఏమైందో ఏమో కానీ.. మంగళవారం బహుళ అంతస్తుల భవనాలు తనిఖీ చేశారు.. స్వయంగా ఇలా కొలతలు వేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 8



నేడు పవన్ రాక

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, శివకోడులో పర్యటించనున్నారు. ఈ మేరకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. భారీ భద్రత నడుమ పవన్ పర్యటన విజయవంతం చేసేందుకు అటు అధికారులు, పోలీసులతో పాటు జనసేన పార్టీ శ్రేణులు తల మునకలై ఉన్నాయి. ఏర్పాట్లను ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. 7

తూరుపు.. సిందూరం!



ఉమ్మడి తూర్పుగోదావరి సిగలో మరో కొత్త జిల్లా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు మూడు కాదు.. నాలుగు కానున్నాయి.. రంపచోడవరం కేంద్రంగా మరో కొత్త జిల్లా పోలవరం ఏర్పాటు కానుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ పార్లమెంట్ నియోజకవర్గాలతో మూడు జిల్లాలుగా ప్రకటించింది. నాడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విభజన జరగలేదు. అప్పట్లో ప్రజలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత సీఎం చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఏజెన్సీలో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నారు.. కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో కలిపారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయనున్నారు.

మండపేట కేరాఫ్ తూర్పుగోదావరి

కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని పూర్తిగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయనున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్నాయి. మండపేట రాజమహేంద్రవరానికి 26.3 కి.మీ దూరంలో ఉండగా ప్రస్తుత జిల్లా కేంద్రం అమలాపురం 47.5 కి.మీ దూరంలో ఉంది.మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అసెంబ్లీలో కోరారు.ఇదే ప్రతిపాదన మంత్రి వర్గ ఉపసంఘం చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట నియోజకవర్గం తొలగిపో నుండడంతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అతి చిన్నదిగా మారిపోతోంది. ఈ డివిజన్‌ను అలాగే ఉంచుతారా లేదా సమీపంలోని కొత్తపేట డివిజన్‌లో కలుపుతారా అనేది చూడాలి. దీంతో కోనసీమ జిల్లాలోని నియోజకవర్గాల సంఖ్య ఆరుకు పడిపోగా.. తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలోను రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడంతో కోనసీమ చిన్న జిల్లాగా మారింది.దీనిపై రాజకీయంగా ఉద్యమాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

- » పోలవరం జిల్లా ఏర్పాటు
- » రంపచోడవరం కేంద్రం
- » రెండు డివిజన్లతో నిర్ణయం
- » నాలుగుకు పెరిగిన జిల్లాలు
- » 'తూర్పు'న కలిసిన మండపేట
- » పెద్దాపురానికి..సామర్లకోట
- » ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట
- » గిరిజనానికి తీరిన ఇబ్బంది
- » ఇక ఆమోదమే తరువాయి..

గిరిజనానికో జిల్లా

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. గత ప్రభుత్వ నిర్వాకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి రంపచోడవరం నియోజకవర్గం వెళ్లిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజ ఒమ్మంగి, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజానీకం జిల్లా కేంద్రానికి 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు సీఎం చంద్రబాబు రంపచోడవరం కేంద్రం పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. 2022లో చంద్రబాబు చింతూరు డివిజన్‌లోని కూనవరం మండలం కోతులగుట్టలో పర్యటించారు. మేము అధికారంలోకి రాగానే పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చారు. ఈ మేరకు 11 మండలాలతో సుమారుగా 3.49 లక్షల జనాభాతో భౌగోళికంగా ఈ కొత్త జిల్లా ఆవిర్భవించనున్నది. వై రామవరం మండలంలోని గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తుది నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం 11 మండలాలతో జిల్లా ఏర్పాటుచేసినా దేవీపట్నం, కూనవరం, వీ.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో 150 గ్రామాలు పోలవరం ముంపులోనికి వెళ్లిపోతాయి. పూర్తిగా కూనవరం, వీ.ఆర్.పురం, దేవీపట్నం మండలాలు కనుమరుగైపోతాయి. చింతూరు, ఎటపాక మండలాల్లో పలు గ్రామాలు ముంపులోనికి వెళ్లిపోతాయి. దీంతో కొత్త జిల్లాలో 8 నుంచి 9 మండలాలే మిగులుతాయి. ఈ పరిస్థితుల్లో పోలవరం నియోజకవర్గాన్ని ఈ జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని యోచిస్తున్నారు. అక్కడా పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాలు ముంపులోకి వెళ్లిపోతాయి. గిరిజన జిల్లాలకు రెవెన్యూ ఎలా ఉంటుందనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెవెన్యూ లేదు. అయినా రంపచోడవరం, చింతూరు డివిజన్ల ప్రజల సమస్యలను ఎలా తీర్చాలన్న అంశంపై ప్రభుత్వం యోచిస్తోంది. పోలవరం జిల్లా ఏర్పాటుతో రాష్ట్రంలో ఇది మూడో గిరిజన జిల్లా. భవిష్యత్తులో మూడు జడ్పీలు గిరిజనులకు కేటాయించబడతాయి. గిరిజన స్వపరిపాలన లక్ష్యం దిశగా కూటమి సర్కారు అడుగులు వేసినట్టవుతుంది.



చారిత్రాత్మక నిర్ణయం

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చింది.
- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

నేడే ఆమోద ముద్ర

కొత్త జిల్లాల ఏర్పాటు, కొన్ని జిల్లాల్లో మార్పులుచేర్పులను సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదించిన వెంటనే నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరిగింది. ఈ మేరకు బుధవారం ఆమోదిస్తారనే ప్రచారం ఉంది. ఆమోదించిన వెంటనే అదే రోజు నోటిఫికేషన్ ఇస్తారు. అప్పటి నుంచి మండపేట నియోజకవర్గం కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి వస్తుంది. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త మ్యాప్ రూపొందించడం.. కొత్తగా పెరిగే గ్రామాలు, మండలాల కసరత్తు మొదలైంది.

పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట

కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సామర్లకోట, పెద్దాపురం మండలాలు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోల పరిధిలో వేర్వేరుగా ఉన్నా యి. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో సామర్లకోట మండలాన్ని కాకినాడ రెవెన్యూ డివిజన్ నుంచి తప్పించి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ జిల్లాలో ఉన్న కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో విలీనం చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. కాజులూరు పేరుకు కాకినాడ జిల్లాలో ఉన్నప్పటికీ ఈ మండలం కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గంలో కొనసాగు తోంది. దీనిపై ప్రభుత్వం ఎటూ నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాజులూరు కాకినాడ జిల్లాలో కొనసాగనుంది.

- (రంపచోడవరం/చింతూరు/ రాజమహేంద్రవరం/అమలాపురం/ మండపేట/ కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విభజన జరిగింది ఇలా..

కొత్త జిల్లాల్లో పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పర్యటించింది. విభజిత జిల్లాలో ఎలాంటి మార్పులు చేయాలనేది పరిశీలించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసింది. నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించింది.

మా పోరాటం ఫలించింది



మా పోరాటం ఫలించింది. కూటమి ప్రభుత్వం మండపేట నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షను నిజం చేసింది. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలుపుతూ తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. ఇది సమష్టి విజయం. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు తీరతాయి. **- వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే**

నేడు విభిన్న ప్రతిభావంతులకు

క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ బుధవారం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఓపెన్ కేటగిరీలో వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి మంగళవారం తెలిపారు. అథ్లెటిక్స్‌తో పాటు ఇండోర్ గేమ్‌లు నిర్వహిస్తామన్నారు. వయసు ఆధారిత, వికలాంగ ఆధారిత కేటగిరీలుగా ఈ పోటీలు ఉంటాయన్నారు. అన్ని కేటగిరీల్లోనూ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 100 మీటర్ల పరుగు పందెం, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, వీల్ చైర్ వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 26వ తేదీన ఉదయం 8 గంటలకు రాజమహేంద్రవరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో హాజరుకావాలని,వివరాలకు 9032934038 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా సివిల్స్ కోచింగ్

నేడు దరఖాస్తులకు చివరితేదీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. అర్హులు బుధవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం తదితర సౌకర్యాలు అందిస్తారని, నాలుగు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు.నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు

డిసెంబరు 31కి ధాన్యం కొనుగోళ్లు పూర్తి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

దివాన్‌చెరువు/అనపర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తవుతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.రాజానగరం మండలం సంపత్‌నగరం, అనపర్తి మండలం పొలమూరు, బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామాల్లో రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలను మంగళవారం సందర్శించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గౌరవించాలని, రైతులను అవమానపరిస్తే ప్రభుత్వాన్ని అవమానించినట్లేనని మిల్లర్లను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 89 వేల మంది రైతుల నుంచి 1.80 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.430 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. తేమశాతం, గోనెసంచులు, రవాణా వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మూడు నెలలుగా పర్యాయ పరిశీలనతో శిక్షణ ఇస్తున్నామని తద్వారా రైతుల్లో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఇక మీదట పడకూడదన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో సొమ్ములు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రస్తుతం 4 గంట ల్లోనే సొమ్ములు జమచేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గతంలో కొందరు మిలర్లు చూపిన నిర్లక్ష్యం రైతులకు ఇబ్బందిగా మారిందని అందువల్ల ధాన్యం రవాణా మిల్లింగ్ ప్రతి దశలోను కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తోందన్నారు. పంటలకు సాగునీటిని సమృద్ధిగా అందించడంతో రైతులు రెండు పంటలు పండించుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరలాల్సిన ఆవశ్యకతను వివరించారు. రైతుల కోసం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు.గత ప్రభుత్వంలో రైతులకు బకాయి పెట్టిన సొమ్ములు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. జేసీ వై.మేఘస్వరూప్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత వారి నుంచి వేలి ముద్రలు తీసుకున్న 4 గంటల్లోనే నగదు జమచేయడం జరుగుతోందన్నారు. ఆయన వెంట రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఆర్డీవో కృష్ణనాయక్,డీఎస్‌వో ఎం.పార్వతి, డీసీవో ఎం.వెంకటరమణ డీఎం సీఎస్ గణేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు, పౌరసరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మలబాబు, ఏఎంసీ ఛైర్మన్ జత్తుక సూర్యకుమారి, జనసేన నాయకుడు రావాడ నాగు, కూటమి నాయకులు ఉన్నారు.



పొలమూరులో రైతుకోసం కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నల్లమిల్లి.. సంపత్‌నగరంలో గోనెసంచుల పరిశీలన





రేపటి.. నాయకులం


నేటి బాలలే రేపటి పౌరులు.. ఆ పౌరులే రేపటి తరం నాయకులు కూడా.. చిన్నతనం నుంచే ప్రశ్నించే తత్వం అలవడాలన్నది పెద్దల మాట.. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొవ్వూరు పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ పార్లమెంటు నిర్వహించారు. విద్యార్థులు ఇలా నాయకులుగా తయారై వచ్చి చట్టసభలో పాల్గొన్నారు. - కొవ్వూరు

ప్రమాదాలు చెప్పిరావు సోదరా!





ప్రమాదాలు చెప్పిరావు.. ఎన్నో సంఘటనలు రుజువు చేశాయి.. అయినా కారు స్టీరింగ్ చేతిలో ఉంటే చాలు.. చాలా మంది రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నారు. కారు చేతిలో ఉంటే సరిపోతుందా..? కారు టైర్‌లో గాలి ఉందో లేదో కూడా చూడడంలేదు.. కనీసం ఇంధనం ఉందో లేదో కూడా చూసుకోనివారెందరో.. ఇంధనం లేకపోతే పరవాలేదు.. టైరులో గాలి లేకపోయినా.. గాలి ఎక్కువైనా ప్రమాదమే కదా.. ఈ చిత్రంలోనే చూడండి.. కడియపులంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఒక కారు టైర్ పేలడంతో అదుపుతప్పింది.. బోల్తా కొట్టి పల్టీలు వేసింది.. అయితే కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.. ఇటీవల ఇటువంటి ప్రమాదాలు సాధారణంగా మారాయి.. డ్రైవర్లూ తస్మాత్ జాగ్రత్త!?
- ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం





భక్తులకు స్వాగతం పలుకుతున్న కుమారసుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆకట్టుకుంటున్న అనంత పద్మనాభస్వామి, దేవతామూర్తుల విద్యుద్దీపాలంకరణ

సుబ్బారాయుడు షష్ఠి

- కుమారసుబ్రహ్మణ్య షష్ఠి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణలు

బిక్కవోలు వెళ్లొద్దాం రండి





బిక్కవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుబ్బారాయుడి షష్ఠి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది బిక్కవోలు. ఇక్కడే జరిగే ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం షష్ఠి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారు జామున 1.10 గంటలకు తీర్థపు బిందె సేవతో ఉత్సవాలను ప్రారంభించి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. ఉదయం 8.20 గంటలకు మయూర వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుపుతారు. మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకూ బాణసంచా కాలుస్తారు. రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలు, బ్యాండు కచేరీలు, శక్తి వేషాలు ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారే వరకు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బాణసంచా కాలుస్తారు. షష్ఠి సందర్భంగా బిక్కవోలు వంతెన వద్ద రామాలయం నుంచి సినిమాహాలు సెంటరు వరకు విద్యుద్దీపాలంకరణ చేశారు. అరపలతో రంగు రంగుల ఎల్‌ఈడీ బల్బులతో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కళావేదిక డెకరేషన్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తోంది. ఆలయ పరిసరాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 1.17 గంటలకు రథోత్సవం జరుగుతుంది. బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. డిసెంబరు 1న ఏకాహం, 2న భారీ అన్నదానంతో ఉత్సవాలు ముగిస్తాయి.

షష్ఠి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. పారిశుధ్య పనుల నిర్వహణకు 55 మందిని నియమించామని పంచాయతీ కార్యదర్శి పద్మజ తెలిపారు. రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని మండల వైద్యాధికారి దుర్గాదేవి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవడానికి ఆలయం మూడువైపులా క్యూలైన్లు ఏర్పాటు చేశామని కార్యనిర్వహణాధికారి ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.





ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన క్యూలైన్లు





సుబ్రహ్మణ్య షష్ఠికి కాకినాడ జిల్లాలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైయున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు (ఎడమ). అపర్ణా సమేత నాగేశ్వరస్వామి విగ్రహాలు కోనేరులో ప్రతిబింబిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. (పైన)

- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

భీమేశ్వరునికి కేంద్ర పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి భట్టాచార్య ప్రత్యేక పూజలు

సామర్లకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి ఏకే భట్టాచార్య సతీ సమేతంగా మంగళవారం కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చిన వారికి కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో సాదర స్వాగతం పలికారు. ఉపాలయాల్లో దేవతామూర్తులను దర్శించిన అనంతరం భట్టాచార్య దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. వారికి నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు. జిల్లా ఉన్నతాధికారులు శ్రీనువాసు, సత్యనారాయణ, పట్టాభి, జిల్లా సామిల్లు యజమానుల సంక్షేమ సంఘ ప్రతినిధి మహంకాళి వెంకటగణేష్ తదితరులు పాల్గొన్నారు.



భట్టాచార్య దంపతులకు వేదాశీర్వచనం, స్వామి-అమ్మవార్ల చిత్రపటం ఇస్తున్న దృశ్యం

అన్ని వర్గాలకు న్యాయం చేసేది కాంగ్రెస్సే

సంఘటన్ శ్రీజాన్ అభయాన్‌లో ఏఐసీసీ అబ్జర్వర్ అంబా ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ అంబా ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఏఐసీసీ అబ్జర్వర్ అంబా ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సంఘటన్ శ్రీజాన్ అభయాన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అంబాతో పాటు పీసీసీ మహిళా విభాగం ఇన్‌చార్జి పరిశీలకురాలు అబిత, పీసీసీ పరిశీలకులు రాజీవ్ రతన్, బాజీ, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ కార్యక్రమం చాలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టామ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వడానికి ఈ విధానాన్ని ఏఐసీసీ అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేలా పార్టీ నాయకులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తొలగించి ఏపీలో అధికారంలోకి తెచ్చేలా దివంగత సీఎం వైఎస్ఆర్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో నాయకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి నేరుగా ఏఐసీసీ నాయకులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలన్నదే కాంగ్రెస్ లోక్ సభాపక్షనేత రాహుల్‌గాంధీ ఉద్దేశ్యమన్నారు. అనంతరం వారిని విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహాబేగ్, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, నాయకులు డాక్టర్ వడయార్, బాలేపల్లి మురళీధర్, జేటీ రామారావు, మేడవరపు భద్రం దొర, ఎస్‌కే అర్షద్, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ఇద్దరి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ గర్ల్స్ స్కూల్ విద్యార్థిని ఆర్.చైత్ర శివవాసుకి, చర్చ్ స్క్వేర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జి.లహరిదుర్గ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ప్రకాశం జిల్లా చందలూరులో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ యోగా అండర్-17 బాలికల ఆర్టిస్టిక్ పెయిర్ విభాగం పోటీలో పాల్గొన్నారు. ఇందులో ప్రథమస్థానం సాధించి జనవరి మొదటి వారంలో త్రిపురాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. కె.చైత్ర వాసుకి యోగా ట్రెడిషనల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ గర్ల్స్ స్కూల్ విద్యార్థినులు హాసిని, ప్రజ్ఞ అండర్-14 విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్‌లో రాష్ట్ర ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు, స్కూలు యాజమాన్యాలకు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీనివాస్, సుధారాణి, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, పీఈటీ త్రిపుల అభినందనలు తెలిపారు.

నిడదవోలులో ఘనంగా

డైమండ్ జూబ్లీ వేడుకలు

నిడదవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న నిడదవోలు పురపాలక సంఘం ఏర్పడి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా రూ.131 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పురపాలక సంఘ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ బుధవారం మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, నవంబరు 27వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టనున్నారు.

నన్నయ ఉమెన్ ఇంటర్ కాలేజీ బాక్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఇంటర్ కాలేజి బాక్సింగ్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్-2025-26 మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించారు.ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన వారికి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ కేవీ స్వామి చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేశారు.ఈ టోర్నమెంట్‌కు యూనివర్సిటీ అబ్జర్వర్‌గా ఎంవీవీ మూర్తి విచ్చేశారు.సెలెక్టర్స్‌గా బి.మధుబాబు(రాజోలు డిగ్రీ కాలేజీ), ఎన్.నరసింహారావు(వైజాగ్ రైల్వే బాక్సింగ్ కోచ్) పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఉమెన్ బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు విచ్చేసి క్రీడాకారిణులను అభినందించారు. ఈ టోర్నీలో గెలుపొందిన వారు డిసెంబరు 24 నుంచి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరుగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాఘవకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభల శ్రీవల్లి, ఎం.సునీత, కె.నీరజ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన వైసుధారాణి, నాగు పాల్గొన్నారు.

కార్పొరేట్ లాభాల కోసం పని చేస్తున్న ప్రభుత్వాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కాకినాడ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ లాభాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, వారికి సహజ సంపదను దోచిపెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆరోపించారు.కాకినాడలోని జయ రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అడవులు, గనులు, ఇతర సంపదను ధారాదత్తం చేస్తోందన్నారు. అందుకోసమే మావోయిస్టులను బలవంతంగా తీ సుకెళ్లి కాల్చి చంపారన్నారు. అటవీ సంపదను రక్షిస్తున్న 1,600 మంది గిరిజనులను పొట్టనపెట్టుకున్నారన్నారు. తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలో కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ల ను తక్షణం రద్దు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కేంద్రం గనులు కేటాయించాలన్నారు. ఎందరో త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- గ్రేడ్-1 నుంచి డిప్యూటీ ఎంపీడీవోలుగా 118 మంది
- గ్రేడ్-2 నుంచి 1కి 192 మంది
- గ్రేడ్-3 నుంచి 2కి 46 మంది

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి భారీస్థాయిలో ఉద్యోగోన్నతులు పొందారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జోన్ 2(ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలు)లో 118 మంది గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా, 198 మంది గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి, అలాగే 46 మంది గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 2కి ఉద్యోగున్నతి పొందారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 మంది గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా, 70 మంది గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి, అలాగే 9 మంది గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 2కి ఉద్యోగున్నతి పొందారు.

వీధి దీపం.. సూర్య దీపం





మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు సూర్యాస్తమయం సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఉలుమూరులో విద్యుత్ స్థంభానికి విద్యుత్(వీధి) బల్బు వెలుగుతున్నట్టు కనువిందు చేసింది.

-చింతూరు(ఆంధ్రజ్యోతి).

బాలికల ఖోఖో విజేత తూర్పుగోదావరి



బహుమతులు అందుకున్న తూర్పుగోదావరి క్రీడాకారులు

విజయనగరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ అండర్-17 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పుగోదావరి జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు, విజయనగరం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి 7 పాయింట్లు, చిత్తూరు 6 పాయింట్లు సాధించాయి. నందిని ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తూర్పు గోదావరి జట్టు గెలుపొందడంలో కీలక భూమిక పోషించింది. డీఈవో మాణిక్యం నాయుడు, డిప్యూటీ మేయర్ శ్రావణి, ఖోఖో సీనియర్ క్రీడాకారులు ఏవీఎన్, పోస్టల్ కబడ్డీ జట్టు రాష్ట్ర కోచ్ శ్రీనివాసరావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాంబాబు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎల్‌వీ రమణ, వెంకటనాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు జట్టుకు ద్వితీయ స్థానం



తలపడుతున్న చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లా జట్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

దేవరపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం, నీరాజనమంత్రపుష్పాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో అర్చకులు అఖండం వీరవెంక ట్రావు శర్మ, సతీశ్‌శర్మ, వంశీకృష్ణమూర్తి శర్మ, కమిటీ సభ్యులు కాత్రు భీమరాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, రాంబాబు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పెళ్లి కొడుకాయెనే..

● అన్నవరంలో నేడు దివ్యకల్యాణం
● రేపు శ్రీపుష్పయాగ మహోత్సవం

అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామి దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వరుడు, వల్లీదేవసేనలను పెళ్లికుమారుడు,పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం 4గంటలకు ఆలయంలో ప్రత్యేక వేదిక వద్దకు నవ వధూవరులు కానున్న స్వామి,అమ్మవార్లను బాజాభజంత్రీల నడుమ తోడ్కొనివచ్చారు. పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూ క్త విధానంలో నిర్వహించారు. అనంతరం ఉల్కాకల గౌరీపూజను నిర్వహించగా ముత్తైదువులు పసుపు దంచారు. స్వామి,అమ్మవార్లను వి శేష అభరణాలు, సుగంధ భరిత పుష్పాలతో అల ంకరించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యా రు. కార్యక్రమం అనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేసి మహిళలకు నానబెట్టిన శెనగలను ప్రసాదంగా పంపిణీచేశారు. రా త్రి 7గంటలకు స్వామివారిని మయూర వాహన ంపై అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులు గా వించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.


ప్రత్యేక వేదికపై దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు, అమ్మవారు


పసుపు దంచుతున్న ముత్తైదువులు


వేడుకను వీక్షిస్తున్న భక్తులు

దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో వేడుక

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణం బుధవారం రాత్రికి అంగరంగ వైభవంగా జరగనుంది. ఆలయం ఎదురుగా ఉన్న అన్నవరం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. ఉదయం నుంచి అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. గురువారం జరిగే శ్రీపుష్పయాగ మహోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

భావనారాయణస్వామి స్థలం ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న ఆలయ ఈవో




అక్రమంగా జేసీబీతో స్థలాన్ని చదును చేయిస్తున్న దృశ్యం, అడ్డుకుని సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో

సర్పవరం జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి చెందిన సుమారు 1500 గజాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఈవో ఆర్.శ్రీనివాసరావు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... సర్పవరం శివారు నిమ్మన ధన్నయ్యగారి తోటలో సర్వే నెం. 6/4లో 3.93 ఎకరాల భూమి ఉంది. ఇది దేవస్థానానికి చెందిన పౌరహిత్యం నౌకరీగా ఆర్ఎస్ఆర్ నమోదు అయ్యి ఉంది. అయితే ఓ వ్యక్తి సుమారు 1500 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని మంగళవారం ఉదయం స్థలంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించి జేసీబీతో చదును చేయి స్తున్నాడు. స్థానికుల ఫిర్యాదుతో ఆలయ ఈవో ఆర్ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి వచ్చి స్థలంలో పనులను నిలుపుదల చేయించారు. ఈ స్థలం దేవదాయశాఖ చెందినదని, ఆక్రమణకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థలంలోకి అక్రమంగా ప్రవేశించినా, అక్రమ నిర్మాణ పనులు చేపట్టిన దేవదాయశాఖ చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆక్రమణదారుడికి సెక్షన్ 83 ప్రకారం నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. బుధవారం దేవదాయశాఖ డీఈవో ఆధ్వర్యంలో దేవదాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

తుది దశకు రెవెన్యూ అధికారులపై విచారణ

విచారణ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో
ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

ఎటపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలంలో 2018 నుంచి 2021 మధ్య కాలంలో పని చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు రెవెన్యూ అధికారులపై విచారణ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో సీతారామమూర్తిని విచారణ అధికారిగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఎటపాక మండలంలో తహశీల్దార్‌గా పనిచేసిన చాట్ల వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేసిన సిరిగి నీడి సుబ్బారావు, కారం సుబ్బారావుతో పాటు మండల సర్వేయర్ డిల్లీశ్వరరావు, ఆర్ఐ గొంది రాంబాబు పలు ఫిర్యాదులపై ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎటపాకకు చెందిన ఓ భూ యజమాని వద్ద ఆ భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు, పట్టాపుస్తకం జారీకిసొమ్ములు డిమాండ్ చేశారని ఆరోపణలు చేస్తూ సదరు భూ యజమాని 2021 ఏప్రిల్‌లో సీఎంవో కాల్‌సెంటర్‌తోపాటు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. దీంతో గత జూన్‌లో ఏసీబీ అధికారులు ఈ అంశంపై విచారణ నిర్వహించారు. ఆ సమయంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఐదుగురు రెవెన్యూ అధికారులకు రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి నోటీసులు జారీ చేసి పదిరోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించారు. ఈ క్రమంలో దీనిపై విచారణ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో సీతారాంమూర్తిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏసీబీ అధికారులు విచారణ నిర్వహించిన డాక్యుమెంట్లు, వాయిస్ రికార్డులు, ఇతరత్ర ఆధారాలను విచారణ అధికారి డీఆర్వోకు అందజేయనున్నారు. ఆ తర్వాత ఏసీబీ అధికారుల నివేదికను డీఆర్వో సీతారాంమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.

బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్

నిర్వాహకులపై కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

కాకినాడ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో సుమారు రూ.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డైరెక్టర్లపై కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, న్యాయవాది వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిశారు. ఆయన సూచన మేరకు కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. 500 మంది అమాయక ప్రజల నుంచి పెద్ద ఎత్తున చిట్టీలు వేయించుకున్న కంపెనీ డైరెక్టర్లు బోర్డు తిప్పేసి బాధితుల నెత్తిన శఠగోపం పెట్టారన్నారు. తక్షణమే చిట్‌ఫండ్స్ కంపెనీ డైరెక్టర్లపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీసీఎం పవన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల నిరసన

అందని వైద్యం.. ఆగిన ప్రాణం!

కాకినాడ జీజీహెచ్‌లో ఘటన

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇటీవల గర్భిణి మరణించిన విషయం విదితమే. ఆ సంఘటన మరువకముందే జీజీహెచ్‌లో వైద్యం అందక ఓ వ్యక్తి మరణించాడు. మృతుడి అల్లుడు గుండా అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన గల్లా గోదారయ్య (58)కు ముగ్గురు కుమార్తెలున్నారు. భార్య గతంలో అనారోగ్యంతో చనిపోయింది. గోదారయ్య వ్యవసాయ కూలీ. ఆదివారం పొలంలో పని చేస్తుండగా పక్షవాతం వచ్చి ఎడమ కాలు, ఎడమ చెయ్యి లాగేశాయి. తోటి కూలీలు ఇంటికి సమాచారం చేరవేయడంతో కుటుంబీకులు గోదారయ్యను ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని సూచించడంతో అదేరోజు రాత్రి జీజీహెచ్‌కు తరలించడంతో ఎం-7 వార్డులో పెట్టారు. అక్కడ ఇంజక్షన్, నార్మల్ సెలైన్ ఎక్కిస్తూ వైద్యం చేస్తున్నట్టు హడావుడి చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గోదారయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతుండడంతో కుటుంబీకులు రాత్రంతా వైద్యులు, సిబ్బంది వద్దకు కాళ్లరిగేలా తిరిగారు. కానీ సాకులు చెప్పుతూ పడకపైనే వదిలేశారు తప్ప కనీస వైద్యం అందించలేదు. దీంతో మంగళవారం ఉదయం గోదారయ్య ఉదయం 11.30 సమయంలో మరణించాడు. వైద్యులకు మానవత్వం లేకపోవడంతోనే తన తండ్రి మరణించాడని గోదారయ్య కుమార్తె వరలక్ష్మి వాపోయింది. చివరకు చేసేదేమిలేక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.


గోదారయ్య మృతదేహం

హైవేపై రెండు మోటార్‌సైకిళ్లు ఢీ

ముగ్గురికి తీవ్రగాయాలు


గొల్లప్రోలు మండలం చేబ్రోలు జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఢీకొన్న మోటార్‌సైకిళ్లు

గొల్లప్రోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు ఎన్‌హెచ్ కూడలి వద్ద మంగళవారం 2మోటార్‌సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన ముగ్గురు మోటార్‌సైకిల్‌పై రామచంద్రపురం వైపు వెళ్తున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరాల శ్రీహరిబాబు చేబ్రోలులోని ఉన్నత పాఠశాల వైపు నుంచి హైవే వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు వస్తున్న మోటార్‌సైకిల్ అదుపు చేయలేక శ్రీహరిబాబును ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీహరిబాబు, ఎస్.ఉమాదుర్గాప్రసాద్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే మొబైల్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మాక్ అసెంబ్లీకి బెండపూడి విద్యార్థి ఎంపిక

తొండంగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి కాకినాడ జిల్లా తుని నియోజకవర్గానికి సంబంధించి బెండపూడి ఉన్నత పాఠశాలకు చెందిన పెయ్యల ఓంకార్ సత్యవెంకట్ ఎంపికయ్యాడు. తమ్మయ్యపేట గ్రామానికి చెందిన సత్యవెంకట్ బెండపూడి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నాడు. మాక్ అసెంబ్లీకి కోసం తమ విద్యార్థి సత్యవెంకట్ అమరావతి బయలుదేరి వెళ్లినట్టు ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్‌కు ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, యనమల రాజేష్, ఎంతఃపోలు షేక్ బాబ్జి, సుబ్బిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సాధనాల వీరరాఘవ నూకరాజు అభినందనలు తెలిపారు.


సత్యవెంకట్

నంది అవార్డులు ఇస్తాం

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
మలికిపురంలో రాజీ... నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్ ప్రారంభం

మలికిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉత్తమ తెలుగు సినిమాలకు నంది అవార్డులను ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలోని చంటిరాజు విల్లాస్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజీ.. నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్‌కు మంత్రి కందుల దుర్గేష్ క్లాప్ నివ్వగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కెమెరా స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. దుర్గేష్ మాట్లాడుతూ నంది అవార్డుల ప్రదానం కోసం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో ఇప్పటికే చర్చలు జరిపారన్నారు. నంది నాటకోత్సవాల నిర్వహణ కూడా చేపడతామన్నారు. ప్రధానంగా కోనసీమలో కేరళకు మించి అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయన్నారు. చిత్ర నిర్మాణాలకు అనుకూలమైన ప్రాంతమని ప్రభుత్వం కూడా ప్రోత్సాహాలు ఇచ్చేందుకు అనుమతులు సులభతరం చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ సినిమాలతో పాటు కార్మికులకు అన్ని ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రాంకీ మీడియా ప్రైవేటు లిమిటెడ్ పతాకంపై గెద్దాడ వెంకటసత్యప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను రాంకీ నిర్మిస్తూ హీరోగా కూడా నటిస్తున్నారు. మరో హీరోగా సందీప్, హీరోయిన్‌గా జయశ్రీ బర్మన్, సహనటులుగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, మాధురి, జబర్దస్త్ అశోక్, రాము నటిస్తున్నారు. కేఎం రాధాకృష్ణ సంగీతం సమకూరుస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో భార్యాభర్తల అన్యోన్యతతో పాటు బంధువుల ప్రేమానురాగాలను ఈ చిత్రంలో చూపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్కెట్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, కేవీ చంటిరాజు, గెద్దాడ నాగేశ్వరరావు, దిరిశాల బాలాజీ, కేవీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సినిమా చిత్రీకరణకు క్లాప్ కొడుతున్న మంత్రి కందుల దుర్గేష్, కెమెరా స్విచ్చాన్ చేస్తున్న మంత్రి సుభాష్

రెండోరోజు ఉత్సాహంగా..

మోరిలో అంతర్‌జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్
విద్యార్థులు విజయాలు అందుకోవాలి : మంత్రి సుభాష్

అంతర్వేది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మోరి హైస్కూలులో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్అండర్-17 బాలబాలిక ఫెన్సింగ్ టోర్నమెంట్ రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులంతా క్రీడల్లో పాల్గొని విజయాలు అందుకోవాలన్నారు. ముందుగా స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని కూడా అలవరచుకుని, వివిధ రాష్ట్రాలకు పోటీ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడానికి విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు వివిధ రంగాల్లో క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


ఫెన్సింగ్ టోర్నమెంటులో తలపడుతున్న విద్యార్థులు


మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

వన్నెచింతలపూడి విద్యార్థినుల ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు


వన్నెచింతలపూడిలో ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డు గ్రహీతలకు పౌర సన్మానం నిర్వహించిన దృశ్యం

అమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి 52రాష్ట్రీయ బాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకుంది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో మల్టీపర్పస్ సైకిల్ మిల్ ప్రాజెక్టు రూపకర్తలైన సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్యశ్రీజ్యోత్స్న, మార్గనిర్దేశనం చేసిన ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణలకు పౌర సన్మానం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి 267 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచగా ఏపీ నుంచి వెళ్లిన మల్టీపర్పస్ ప్రాజెక్టు ప్రశంసలు పొంది ఉత్తమ ప్రజా స్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకోవడం విశేషమని వన్నెచింతలపూడి, సమనస సర్పంచ్‌లు నక్కా రాజారత్నవాగవాణి, పరమట శ్యామ్, ఎంపీటీసీ నాగమణి కొనియాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. మాజీ చైర్మన్ కుంచే వెంకటేశ్వరరావు, సదాశివుడు, కె.రమేష్, పరమట భీమామహేష్, గిడుగు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బడుగు సత్యనారాయణ, అడబాల శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వెండి పతకాలు అందజేయనున్నట్టు గిడుగు నాగేశ్వరరావు ప్రకటించారు.

నేడు కోనసీమకు డిప్యూటీ సీఎం

● పవన్‌కల్యాణ్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు
● కేశనపల్లిలో డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరితోటల పరిశీలన

అమలాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, శివకోడులో జరపనున్న పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. భారీ భద్రత నడుమ పవన్ పర్యటనను విజయవంతం చేసేందుకు అటు అధికారులు, పోలీసులతో పాటు జనసేన పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో తల మునకలై ఉన్నాయి. శివకోడులోని 2.0 కార్యక్రమాల ప్రారంభంతో పాటు బహిరంగ సభకు కాపు కల్యాణ మండపం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సుమారు 10వేల మంది ప్రజలు పాల్గొనే విధంగా సన్నాహాలు చేశారు. పవన్ రాక కోసం గూడపల్లి, శివకోడులో ప్రత్యేక హెలిప్యాడ్లను కూడా ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. అలాగే జిల్లా ఎస్పీ భద్రతా పరమైన చర్యలను ప్రకటించారు. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాల్లో జనసైనికులు భారీగా ఫ్లెక్సులు, జెండాలు ఏర్పాటు చేసి స్వాగత ద్వారాలు సిద్ధం చేశారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు పవన్ పర్యటనకు సంబంధించి అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. పవన్ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యేక పాస్‌లు ఇచ్చినవారికి మాత్రమే ఆయా ప్రాంతాల్లోకి అనుమతించే రీతిన ఏర్పాట్లు చేశారు. కాగా కేశనపల్లి డ్రెయిన్ వల్ల కొబ్బరిచెట్లకు జరిగిన నష్టం అంచనాలను పవన్‌కల్యాణ్ కేశనపల్లి వంతెన నుంచి వీక్షించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటారని రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.


శివకోడులో పవన్ పాల్గొనే బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లు

పవన్ పర్యటన సాగేదిలా..

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి విమానంలో బయలుదేరతారు. 9.45కు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.10 గంటలకు మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరకుంటారు. 10.15 గంటలకు కేశనపల్లి వ్యూ పాయింట్‌కు చేరకుని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తారు. స్థానికంగా 20 మంది బాధిత కొబ్బరి రైతులతో ముఖాముఖిగా తోటలు దెబ్బతినడానికి గల కారణాలపై చర్చిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన కేశనపల్లి నుంచి శివకోడుకు 11.20 గంటలకు చేరుకుంటారు. శివకోడులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. రాష్ట్రస్థాయి పల్లెపండుగ 2.0 పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం శివకోడులో సభాస్థలికి కూతవేటు దూరంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ అంత్యక్రియలు

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. అమలాపురం ఎంపీ జీ.హరిష్‌మాధూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తొలుత శ్రీవరప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు టీడీపీ జెండాను కప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ప్రకాష్ పార్థివదేహాన్ని ఏడిద సంఘమేశ్వరంలో ఉన్న కైలాసభూమికి తరలించారు. ప్రకాష్ తనయుడు కిరిటీ అంత్యక్రియలు నిర్వహించారు. ప్రకాష్ అంతిమయాత్రకు భారీసంఖ్యలో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు.


ప్రకాష్ పార్థివదేహంపై టీడీపీ జెండా ఉంచుతున్న ఎంపీ, ఎమ్మెల్యే


అంత్యక్రియల్లో ప్రకాష్ కుమారుడు కిరీటీ, స్థానిక నాయకులు

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



యానాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యానాం నల్ల చెరువులోకి నీరు వెళ్లే ఫ్రెంచ్ కాలువలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. యానాంలోని ప్రధాన మంచినీటి ట్యాంక్‌లకు ఈ కాలువ నుంచే నీటిని నింపుతుంటారు. ఈ సంఘటనతో యానాంలో అందరు ఆందోళన చెందుతున్నారు. అయితే గత పది రోజులుగా తోడేందుకు అంతగా ఈ కాలువలో నీరు లేకపోవడంతో మంచినీటి ట్యాంక్‌లకు నీరునింపడం లేదు. అయితే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న దుకాణ సముదాయం లోపలభాగంలోని ఖాళీ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందడంతో మంగళవారం స్థానికులు గుర్తించారు. ఈ సంఘటనపై స్థానిక పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై లుంగీ కప్పి ఉంది.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



పాలక మండలి సభ్యులను అభినందిస్తున్న నాయకులు

ధవళేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, స్వయంభూ అగస్త్యేశ్వరస్వామి ఆలయాల ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఆయా ఆలయాల్లో నిర్వహించారు.వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా నీలి వీర కోటేశ్వరరావు, సభ్యులుగా బీర జయప్రకాష్, దిండి జగదీష్, పి.రవి కిరణ్, ఆకేటి దుర్గాపార్వతి, మద్దుల లక్ష్మి, కురెళ్ల రామలక్ష్మి, ఎల్లపు లక్ష్మిలతో ఈవో నాగసురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి అగస్త్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా అలంపల్లి ముత్యాలరావు, సభ్యులుగా దొడ్డి బాబ్జి, టి.రామసుబ్బారావు, కింతాడ శివశంకర్, వంకధారి కుభేరరావు, బొక్కా శ్రీదేవి, సబ్బితి సునీత, బొమ్మిడి శ్రీదేవి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీ చైర్మన్లు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులను కూటమి నాయకులు మచ్చేటి ప్రసాద్, పండూరి అప్పారావు, తలారి మూర్తి, యడ్ల మహేష్, కొడమంచలి సూర్య, వఝ్రే రాజేష్, ఒంటెద్దు స్వామి తదితరులు అభినందించారు.

పాఠశాల విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



బేస్‌లైన్ ఎఫ్ఎల్ఎన్ పరీక్ష నిర్వహిస్తున్న నరేంద్ర

బిక్కవోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో విద్యార్థుల బేస్‌లైన్ ఎఫ్ఎల్ఎన్(ప్రాథమిక చదువు, లెక్కల నైపుణ్యాలు) పరీక్ష ని ర్వహించారు.ఈ సందర్భంగా వీరు ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు, లెక్కలపై ఈ పరీక్షలు జరిపారు.ఈ పరీక్షల్లో విద్యార్థుల ప్రస్తుత స్థాయిని అంచనా వేసి ఏ,బీ,సీ,డీ గ్రేడులుగా విభజిస్తారు.ఈ నెల 30లోగా విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించి గ్రేడులు కేటాయిస్తారు. వెనుకబడిన విద్యార్థులకు డిసెంబరు 5నుంచి వంద రోజుల్లో వారిని ఏ గ్రేడు స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దుతారు. బిక్కవోలు నెం.1 పాఠశాలలో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుడు నరేంద్ర విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీతానగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి, సింగవరం గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం అందజేశారు. వంగలపూడికి చెందిన గుమ్మళ్ళ పోశిరత్నం రూ.30 వేలు, కొమ్మిరెడ్డి గంగారావుకు రూ.30,700, సంగన నాగ వెంకటలక్ష్మికి రూ.21,600, సింగవరానికి చెందిన గుర్రం దావయ్యకు రూ.60 వేలు విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు, గద్దే వెంకటకృష్ణ, వలవల రాజా, సింగవరం సర్పంచ్ సంగన పోసియ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బీవీఆర్ చౌదరి

ఫీజులు కట్టాలంటూ విద్యార్థులపై జీజీయూ ఒత్తిడి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీలో రెండో సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులను ఫీజులు కట్టాలంటూ యాజమాన్యం ఒత్తిడి చేస్తోందని, కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ విషయంపై చర్చలు జరిగిన సమయంలో పరీక్షల్లో విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదని చెప్పినా జీజీయూ యాజమాన్యం మాట వినడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.10,000లతో పాటు పెనాల్టీ మొత్తం కూడా కడితేనే పరీక్షలకు అనుమతిస్తున్నారని, ఫీజుల వ్యవహారంలో కళాశాల అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

సీతానగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గుళ్ల, సీతానగరం గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి సీతానగరం శివాలయంలో జరిగిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణంలో వలవల కొండలరాయుడు, నాగదేవి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా ఆలయార్చకులు కొడమంచిలి రాంబాబు కల్యాణం జరిపించారు.అలాగే ముగ్గుళ్లలో దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఆలయంలో ముగ్గురు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా ఆలయార్చకులు కొడమంచిలి ఉమాస్వామి, విజయ్‌కుమార్, వినేష్ స్వామివారి కళ్యాణం జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా భక్తుల దర్శనార్థం స్వామివారిని అలంకరించారు.

మహిళలను వేధిస్తే శిక్షలు తప్పవు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను లైంగికంగా వేధించినా, అవాంఛితంగా ప్రవర్తించినా, అసభ్యకర చర్యలకు పాల్పడినా శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్‌తో కలిసి పలు మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును కేవీ స్టేట్ హోంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళ భద్రతకు అమల్లో ఉన్న చట్టాలను వివరించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఉండ్రాజవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తణుకు వెళ్లే రోడ్డులో పాలంగి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు నోటీసులు

మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా నగరంలో నూతన భవనాల తనిఖీ



నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ప్లాన్లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు నోటీసులు జారీ చేయాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని సీతంపేట, గాదాలమ్మనగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వివిధ భవనాల అసెస్మెంట్ డిమాండ్లతో కొలతలను పరిశీలించామని, బహుళ అంతస్తు భవనాలు నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామని స్పష్టం చేశారు.ప్లాన్లకు విరుద్ధంగా ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేయాలన్నారు.కమిషనర్ వెంట డిప్యూటీ సిటీప్లానర్ నాయుడు, పి.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి మహిళా కమిషన్ తోడ్పాటు

ఉండ్రాజవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యల పరిష్కారానికి మహిళా కమిషన్ తోడ్పాటు అందిస్తుందని మండల పారాలీగల్ వలంటీర్ కాకర్ల నరసన్న నాని చెప్పారు. మంగళవారం మండలంలోని పాలంగిలో ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ, తణుకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచార, గృహహింస, మానసిక వేధింపులను అరికట్టేందుకు మహిళా కమిషన్ ఎంతో సహకరిస్తుందని పేర్కొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

ఎమ్మెల్యే నెహ్రూ.. తిరుమలాయపాలెంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తపల్లి పీహెచ్‌సీకి అనుసంధానంగా ఈ వెల్‌నెస్ సెంటర్లు ఆరోగ్య సేవలందిస్తాయన్నారు.వైద్యులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. అనంతరం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను తెలుసుకున్నారు.విద్యార్థులను కలిసి పాఠశాల్లో కల్పించవలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, టీడీపీ నాయకులు ఏసీవీఎస్ అప్పలరాజు, ఉంగరాల రాము, పిల్లా చంటిబాబు, కన్నబాబు, పురంశెట్టి శివాజీ, ఉండమట్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు నిలువ నీడలేకుండా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్టు సంఘ వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. యాదవోలుకు చెందిన సమ్మంగి రమణయ్య, అంజమ్మ అనే వృద్ధ దంపతులు 50 ఏళ్లకు పైబడి గ్రామంలోని పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారని, వారిని స్థానికుడు చంద్రమౌళి తన అనుచరులతో దౌర్జన్యంగా గుడిసె నుంచి గెంటించాడన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లగా హైకోర్టు.. నియమ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. దీంతో ఈ సమస్యను బాధితులతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని వారు చెప్పారు.రమణయ్య దంపతులకు న్యాయం చేయాలని కోరామన్నారు.

మాజీ ఎంపీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు!

చాంబర్ మాజీ అధ్యక్షుడు సత్యంబాబు, దేవిచౌక్ వర్తక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పబ్లిసిటీ పిచ్చితో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, దేవిచౌక్ వర్తక సంఘం అధ్యక్షుడు స్వాతి సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ల రాష్ట్రాన్ని జగన్ నాశనం చేస్తే మిడిమిడి జ్ఞానంతో నగరాన్ని భరత్ సర్వనాశనం చేశాడన్నారు. సొంత అజెండాతో పనిచేసి అడ్డదిడ్డంగా వ్యవహరించి దేవిచౌక్, పుష్కరఘాట్‌లలో రాళ్ల వేయడం వల్ల నిత్యం వీటిని తన్నుకుని ప్రజలు పడిపోతున్నారన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందన్నారు. అతిత్వరలో ఈ రెండు సెంటర్లలో రోడ్డు వేస్తారని సత్యంబాబు చెప్పారు. భరత్ తన ఇష్టానుసారం వ్యవహరిస్తే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రజాభిష్టం మేరకు ఆలోచన చేసి పనులు చేస్తున్నారని ఎక్కడా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అభివృద్ధి పనులు చేయిస్తున్నారని వారు స్పష్టం చేశారు.

అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సూరారెడ్డి కన్నుమూత



అనపర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లమిల్లి సూరారెడ్డి(80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సుదీర్ఘ రాజకీయం అనుభవం ఉన్న సూరారెడ్డి రాయవరం మునసబు ఉండవిల్లి సత్యనారాయణమూర్తి శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఒక పర్యాయం రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గాను. మరో పర్యాయం అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గాను పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.కుమార్తె కర్రి శేషారత్నం అనపర్తి ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేశారు. సూరారెడ్డి మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన మాతృమూర్తి సత్యవతి.. సూరారెడ్డి ఇంటికి చేరుకుని ఆయన పార్థీవ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

స్వదేశీ ఉత్పత్తుల వాడకంపై అవగాహన అవసరం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి మనం చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ దేశంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా స్వదేశీ ఉత్పత్తులను వాడుతూ ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆత్మనిర్భర భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు,నాయకులు పన్నాల లక్ష్మి సంతోషి, పరిమి రాధ, కోడూరి లక్ష్మీనారాయణ, రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ మండలాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్శనాలు కల్పించాలి

ఎస్పీ నరసింహకిషోర్



షష్ఠి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

బిక్కవోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ సూచించారు. మంగళవారం రాత్రి ఆయన బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన లైన్లు, ఆలయం లోపల ఏర్పాట్లను పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈయన వెంట ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రాజారెడ్డి, సాయిబాబారెడ్డి, డీఎస్పీ విద్య, స్థానిక ఎస్ఐ రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు

కోరుకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. అందుకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 26వ తేదీ రాత్రి 8గంటలకు స్వామి వారి కల్యాణం, అంతకుముందు వీరభద్రుడి సంబరం, వేదిక సినీ సంగీత విభావరి జరుగుతుంది.

స్వామివారికి వెండి కిరీటం సమర్పణ.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుల్లెపు రామారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు పుల్లపు గంగరాజు కాపు సూర్యకుమారి దంపతులు మంగళవారం సాయంత్రం కమిటీ అధ్యక్షుడు బుచ్చిబాబు, సభ్యులకు అందజేశారు. అలాగే వల్లిదేవికి, దేవసేనదేవకి రెండు వెండి కిరీటాలను వఝ్రే నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య వఝ్రే సూర్యరత్నం, కుమారుడు సత్యప్రసాద్‌లు కమిటీ వారికి అందజేశారు. ఆలయార్చకులు కిరీటాలకు పూజలు నిర్వహించి స్వామి, అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి, వంటిపల్లి సత్యనారాయణ, కటకం సత్యనారాయణ, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, నీరుకొండ బాబ్జి, కోలా వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

నన్నయలో బొటానికల్ గార్డెన్ పునరుద్ధరణ



వర్శిటీలో మొక్కలు నాటుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని నందనవనంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్శిటీ వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌ను పునరుద్ధరిస్తూ మంగళవారం మొక్కలు నాటారు. వీసీతోబాటు ఆర్కిటెక్ట్ కె.విజయానంద్, హిందీ తెలుగు అనువాదకులు గణేష్‌రామ్ అనువేది హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ వనంలో అన్ని ఔషధమొక్కలు, అరుదైన జాతి మొక్కలు నాటుతామని, వాటిని విద్యార్థులు పర్యవేక్షిస్తారని చెప్పారు. యూనివర్శిటీని నందనవనంగా తీర్చిదిద్దేందుకు హిందీ తెలుగు అనువాదకులు గణేష్‌రామ్ అనువేది తమ కుటుంబం తరపున రూ.లక్ష బహూకరిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్రం విభాగ అధ్యాపకులు వి.పద్మావతి, డి.స్పందన, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థుల ఆరోగ్యంపై సమీక్ష



అంగన్‌వాడి విద్యార్థుల ఆరోగ్యంపై సమీక్షా సమావేశం

సీతానగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భారతి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లోని ప్రతి చిన్నారిని వైద్యాధికారి పరీక్షించి వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షించి, ఇంకా ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే సమగ్రంగా పరీక్షించి తగిన వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో యర్రా సుబ్బారాయుడు పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్వైజర్లు సుధాకర్, కె.పెదలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

జాస్తి జానికిరామయ్య చౌదరి S/o వీర్రాజు డోర్.నెం. 3-88 మురమండ కడియం మండలం, పాస్‌పోర్ట్‌నెం. Y5008545 మురమండ నుంచి రాజమండ్రికి వెళ్ళుచున్నడగా మార్గ మధ్యలో పడిపోయినది దొరికి వారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. సెల్:9515616220

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

సీతానగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొబ్బిల్లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎస్.జాన్‌వెస్లీ, గుల్లి నాగకనక మహాలక్ష్మి, టి.భార్గవి విజేతలుగా నిలిచినట్టు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ టి.మాచరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం యువతకు స్ఫూర్తి

చాగల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి అని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీని వాసరావు అన్నారు.మంగళవారం మండలంలోని ఊనగట్ల జడ్పీ హైస్కూల్లో దాత,మహిత గ్రూప్ అధినేత కాగిత సురేష్‌కుమార్(హైదరాబాద్) సహకారంతో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో దేశ నాయకులు విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, ఎస్ఎంసీ చైర్మన్ కామన శివ, హెచ్ఎం రమణ పాల్గొన్నారు.

పిల్లలందరికీ వైద్య పరీక్షలు

పెరవలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లలందరికీ రాబోయే 10రోజుల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఎత్తు, బరువు గుర్తించాలని పెరవలి పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ చెప్పారు. ప్రతీ మంగళవారం జరిగే కన్వర్జెన్సీ మీటింగ్‌కు ఆరోగ్య,అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, పాల్గొనాలన్నారు.

8
నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని నిరసన
పోలీసులకు చిక్కిన 11 మంది జూదరులు



షష్ఠికి ముస్తాబు

జిల్లాలోని పలు ఆలయాలు షష్ఠికి ముస్తాబయ్యాయి. బుధవారం సుబ్రహ్మణ్యేశ్వ రుడి షష్ఠి సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.. ఉండ్రాజవరం, బిక్కవోలు, రాజమహేంద్రవరం లోని సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. బిక్కవోలులోని ఆలయం వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.

8



అక్రమాలను పట్టేస్తా..

టౌన్ ప్లానింగ్ ఏం చేస్తోంది..? ఉందా లేదా..? రాజమహేంద్రవరం నగరంలో చూస్తే పరిమితి మించిన భవనాలు ఎన్నో ఉన్నాయి.. అయినా చర్యలు మాత్రం శూన్యం.. పైకి అంతా బాగానే ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకసారి లోతుకు వెళ్లి చూస్తే అసలు విషయం బోధపడుతోంది. రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనాకు ఏమైందో ఏమో కానీ.. మంగళవారం బహుళ అంతస్తుల భవనాలు తనిఖీ చేశారు.. స్వయంగా ఇలా కొలతలు వేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




నేడు పవన్ రాక

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, శివకోడులో పర్యటించనున్నారు. ఈ మేరకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. భారీ భద్రత నడుమ పవన్ పర్యటన విజయవంతం చేసేందుకు అటు అధికారులు, పోలీసులతో పాటు జనసేన పార్టీ శ్రేణులు తల మునకలై ఉన్నాయి. ఏర్పాట్లను ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు.

తూరుపు.. సిందూరం!

ఉమ్మడి తూర్పుగోదావరి సిగలో మరో కొత్త జిల్లా



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు మూడు కాదు.. నాలుగు కానున్నాయి.. రంపచోడవరం కేంద్రంగా మరో కొత్త జిల్లా పోలవరం ఏర్పాటు కానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ పార్లమెంట్ నియోజకవర్గాలతో మూడు జిల్లాలుగా ప్రకటించింది. నాడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విభజన జరగలేదు. అప్పట్లో ప్రజలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత సీఎం చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఏజెన్సీలో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నారు.. కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో కలిపారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయనున్నారు.

మండపేట కేరాఫ్ తూర్పుగోదావరి

కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని పూర్తిగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయనున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్నాయి. మండపేట రాజమహేంద్రవరానికి 26.3 కి.మీ దూరంలో ఉండగా ప్రస్తుత జిల్లా కేంద్రం అమలాపురం 47.5 కి.మీ దూరంలో ఉంది.మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అసెంబ్లీలో కోరారు.ఇదే ప్రతిపాదన మంత్రి వర్గ ఉపసంఘం చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట నియోజకవర్గం తొలగిపోనుండడంతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అతి చిన్నదిగా మారిపోతోంది. ఈ డివిజన్‌ను అలాగే ఉంచుతారా లేదా సమీపంలోని కొత్తపేట డివిజన్‌లో కలుపుతారా అనేది చూడాలి. దీంతో కోనసీమ జిల్లాలోని నియోజకవర్గాల సంఖ్య ఆరుకు పడిపోగా.. తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలోను రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడంతో కోనసీమ చిన్న జిల్లాగా మారింది.దీనిపై రాజకీయంగా ఉద్యమాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

- » పోలవరం జిల్లా ఏర్పాటు
- » రంపచోడవరం కేంద్రం
- » రెండు డివిజన్లతో నిర్ణయం
- » నాలుగుకు పెరిగిన జిల్లాలు
- » 'తూర్పు'న కలిసిన మండపేట
- » పెద్దాపురానికి..సామర్లకోట
- » ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట
- » గిరిజనానికి తీరిన ఇబ్బంది
- » ఇక ఆమోదమే తరువాయి..

గిరిజనానికో జిల్లా

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. గత ప్రభుత్వ నిర్వాకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి రంపచోడవరం నియోజకవర్గం వెళ్లిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజానీకం జిల్లా కేంద్రానికి 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు సీఎం చంద్రబాబు రంపచోడవరం కేంద్రం పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. 2022లో చంద్రబాబు చింతూరు డివిజన్‌లోని కూనవరం మండలం కోతులగుట్టలో పర్యటించారు. మేము అధికారంలోకి రాగానే పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చారు. ఈ మేరకు 11 మండలాలతో సుమారుగా 3.49 లక్షల జనాభాతో భౌగోళికంగా ఈ కొత్త జిల్లా ఆవిర్భవించనున్నది. వై రామవరం మండలంలోని గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తుది నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం 11 మండలాలతో జిల్లా ఏర్పాటుచేసినా దేవీపట్నం, కూనవరం, వీ.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో 150 గ్రామాలు పోలవరం ముంపులోనికి వెళ్లిపోతాయి. పూర్తిగా కూనవరం, వీ.ఆర్.పురం, దేవీపట్నం మండలాలు కనుమరుగైపోతాయి. చింతూరు, ఎటపాక మండలాల్లో పలు గ్రామాలు ముంపులోనికి వెళ్లిపోతాయి. దీంతో కొత్త జిల్లాలో 8 నుంచి 9 మండలాలే మిగులుతాయి. ఈ పరిస్థితుల్లో పోలవరం నియోజకవర్గాన్ని ఈ జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని యోచిస్తున్నారు. అక్కడా పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాలు ముంపులోకి వెళ్లిపోతాయి. గిరిజన జిల్లాలకు రెవెన్యూ ఎలా ఉంటుందనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెవెన్యూ లేదు. అయినా రంపచోడవరం, చింతూరు డివిజన్ల ప్రజల సమస్యలను ఎలా తీర్చాలన్న అంశంపై ప్రభుత్వం యోచిస్తోంది. పోలవరం జిల్లా ఏర్పాటుతో రాష్ట్రంలో ఇది మూడో గిరిజన జిల్లా. భవిషత్తులో మూడు జడ్పీలు గిరిజనులకు కేటాయించబడతాయి. గిరిజన స్వపరిపాలన లక్ష్యం దిశగా కూటమి సర్కారు అడుగులు వేసినట్టవుతుంది.



చారిత్రాత్మక నిర్ణయం

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చింది.
- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

నేడే ఆమోద ముద్ర

కొత్త జిల్లాల ఏర్పాటు, కొన్ని జిల్లాల్లో మార్పులుచేర్పులను సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదించిన వెంటనే నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరిగింది. ఈ మేరకు బుధవారం ఆమోదిస్తారనే ప్రచారం ఉంది. ఆమోదించిన వెంటనే అదే రోజు నోటిఫికేషన్ ఇస్తారు. అప్పటి నుంచి మండపేట నియోజకవర్గం కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి వస్తుంది. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త మ్యాప్ రూపొందించడం.. కొత్తగా పెరిగే గ్రామాలు, మండలాల కసరత్తు మొదలైంది.

పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట

కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సామర్లకోట, పెద్దాపురం మండలాలు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోల పరిధిలో వేర్వేరుగా ఉన్నా యి. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో సామర్లకోట మండలాన్ని కాకినాడ రెవెన్యూ డివిజన్ నుంచి తప్పించి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ జిల్లాలో ఉన్న కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో విలీనం చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. కాజులూరు పేరుకు కాకినాడ జిల్లాలో ఉన్నప్పటికీ ఈ మండలం కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గంలో కొనసాగుతోంది. దీనిపై ప్రభుత్వం ఎటూ నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాజులూరు కాకినాడ జిల్లాలో కొనసాగనుంది.

- (రంపచోడవరం/చింతూరు/రాజమహేంద్రవరం/అమలాపురం/మండపేట/కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విభజన జరిగింది ఇలా..

కొత్త జిల్లాల్లో పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పర్యటించింది. విభజిత జిల్లాలో ఎలాంటి మార్పులు చేయాలనేది పరిశీలించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసింది. నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించింది.

మా పోరాటం ఫలించింది



మా పోరాటం ఫలించింది. కూటమి ప్రభుత్వం మండపేట నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షను నిజం చేసింది. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలుపుతూ తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. ఇది సమష్టి విజయం. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు తీరతాయి. **- వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే**

నేడు విభిన్న ప్రతిభావంతులకు
క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ బుధవారం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఓపెన్ కేటగిరీలో వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి మంగళవారం తెలిపారు. అథ్లెటిక్స్‌తో పాటు ఇండోర్ గేమ్‌లు నిర్వహిస్తామన్నారు. వయసు ఆధారిత, వికలాంగ ఆధారిత కేటగిరీలుగా ఈ పోటీలు ఉంటాయన్నారు. అన్ని కేటగిరీల్లోనూ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 100 మీటర్ల పరుగు పందెం, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, వీల్ చైర్ వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 26వ తేదీన ఉదయం 8 గంటలకు రాజమహేంద్రవరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో హాజరుకావాలని,వివరాలకు 9032934038 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా సివిల్స్ కోచింగ్
నేడు దరఖాస్తులకు చివరితేదీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. అర్హులు బుధవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం తదితర సౌకర్యాలు అందిస్తారని, నాలుగు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు.నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు

డిసెంబరు 31కి ధాన్యం కొనుగోళ్లు పూర్తి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

దివాన్‌చెరువు/అనపర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తవుతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.రాజానగరం మండలం సంపత్‌నగరం, అనపర్తి మండలం పొలమూరు, బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామాల్లో రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలను మంగళవారం సందర్శించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గౌరవించాలని, రైతులను అవమానపరిస్తే ప్రభుత్వాన్ని అవమానించినట్లేనని మిల్లర్లను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 89 వేల మంది రైతుల నుంచి 1.80 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.430 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. తేమశాతం, గోనెసంచులు, రవాణా వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మూడు నెలలుగా పర్యాయ పరిశీలనతో శిక్షణ ఇస్తున్నామని తద్వారా రైతుల్లో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఇక మీదట పడకూడదన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో సొమ్ములు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రస్తుతం 4 గంట ల్లోనే సొమ్ములు జమచేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గతంలో కొందరు మిలర్లు చూపిన నిర్లక్ష్యం రైతులకు ఇబ్బందిగా మారిందని అందువల్ల ధాన్యం రవాణా మిల్లింగ్ ప్రతి దశలోను కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తోందన్నారు. పంటలకు సాగునీటిని సమృద్ధిగా అందించడంతో రైతులు రెండు పంటలు పండించుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరలాల్సిన ఆవశ్యకతను వివరించారు. రైతుల కోసం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు.గత ప్రభుత్వంలో రైతులకు బకాయి పెట్టిన సొమ్ములు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. జేసీ వై.మేఘస్వరూప్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత వారి నుంచి వేలి ముద్రలు తీసుకున్న 4 గంటల్లోనే నగదు జమచేయడం జరుగుతోందన్నారు. ఆయన వెంట రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఆర్డీవో కృష్ణనాయక్,డీఎస్‌వో ఎం.పార్వతి, డీసీవో ఎం.వెంకటరమణ డీఎం సీఎస్ గణేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు, పౌరసరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మలబాబు, ఏఎంసీ ఛైర్మన్ జత్తుక సూర్యకుమారి, జనసేన నాయకుడు రావాడ నాగు, కూటమి నాయకులు ఉన్నారు.



పొలమూరులో రైతుకోసం కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నల్లమిల్లి.. సంపత్‌నగరంలో గోనెసంచుల పరిశీలన





రేపటి.. నాయకులం

నేటి బాలలే రేపటి పౌరులు.. ఆ పౌరులే రేపటి తరం నాయకులు కూడా.. చిన్నతనం నుంచే ప్రశ్నించే తత్వం అలవడాలన్నది పెద్దల మాట.. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొవ్వూరు పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ పార్లమెంటు నిర్వహించారు. విద్యార్థులు ఇలా నాయకులుగా తయారై వచ్చి చట్టసభలో పాల్గొన్నారు.

8

ప్రమాదాలు చెప్పిరావు సోదరా!



ప్రమాదాలు చెప్పిరావు.. ఎన్నో సంఘటనలు రుజువు చేశాయి.. అయినా కారు స్టీరింగ్ చేతిలో ఉంటే చాలు.. చాలా మంది రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నారు. కారు చేతిలో ఉంటే సరిపోతుందా..? కారు టైర్‌లో గాలి ఉందో లేదో కూడా చూడడంలేదు.. కనీసం ఇంధనం ఉందో లేదో కూడా చూసుకోనివారెందరో.. ఇంధనం లేకపోతే పరవాలేదు.. టైరులో గాలి లేకపోయినా.. గాలి ఎక్కువైనా ప్రమాదమే కదా.. ఈ చిత్రంలోనే చూడండి.. కడియపులంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఒక కారు టైర్ పేలడంతో అదుపుతప్పింది.. బోల్తా కొట్టి ఫల్టీలు వేసింది.. అయితే కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.. ఇటీవల ఇటువంటి ప్రమాదాలు సాధారణంగా మారాయి.. డ్రైవర్లూ తస్మాత్ జాగ్రత్త!?
- ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం



కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో మాక్ పార్లమెంటులో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

చట్టసభలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

• మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులతో మాక్ పార్లమెంట్
• పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచి చట్టసభలు, వాటి పనితీరు పట్ల అవగాహన కల్పించడానికే మాక్ పార్లమెంటు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొవ్వూరు పండిత మదనమోహన మాలవ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటు సభకు విద్యార్థులు నిర్వహించిన సభకు ఎక్కడా తేడా లేకుండా 100 శాతం చక్కగా నిర్వహించడంపై విద్యార్థులను అభినందించారు. చట్టసభల విశిష్టత, వాటి పనితీరు, రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధి, సామాజిక అభ్యున్నతి వంటి అంశాలపై చిన్నతనం నుంచి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజానికి డాక్టర్, లాయర్, పోలీసు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి వారు ఎంత ముఖ్యమో రాజకీయ నాయకులు అంతే ముఖ్యమన్నారు. తాము ఎన్నో సంవత్సరాలపాటు కష్టపడి ప్రజల అభిమానాన్ని పొంది ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో మాక్ పార్లమెంటు, మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రసంశాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాక్ పార్లమెంటు నిర్వహిస్తున్న విద్యార్థులు

మహిళా చట్టాలపై అవగాహన

మహిళల భద్రతకు ఎన్నో చట్టాలు రూపొందించారని వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ అన్నారు. కొవ్వూరు ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంటు సెల్, ఎన్‌ఎస్‌ఎస్, ఉన్నత భారత అభియాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ స్త్రీహింసా వ్యతిరేక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొవ్వూరు బార్‌అసోసియేషన్ న్యాయవాదులు ఎం.శ్రీవల్లీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న హింసలు, వాటి నిర్మూలనకు రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది మన్నవ రఘురామ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, న్యాయవాదులు పి.తారాకుమారి, లోక్‌అదాలత్ సభ్యులు శేఖర్, అధ్యాపకులు ఎం.అనూష, ఎస్.మాదవి, ఎస్.భార్గవి, ఎ.కాంతమ్మ, షేక్ ఆయేషా, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ వై.రవీంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కమిషన్ తోడ్పాటు

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలు పరిష్కారానికి మహిళా కమిషన్ తోడ్పాటు అందిస్తుందని ఉండ్రాజవరం మండల పారా లీగల్ వలంటీర్ కాకర్ల నరసన్న నాని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాలంగిలో ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ, తణుకు న్యాయసేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచార, గృహహింస, మానసిక వేధింపులకు గురవుతున్న మహిళలకు మహిళా కమిషన్ ఎంతో సహకరిస్తుందని నరసన్న నాని చెప్పారు. మహిళలకు సంబంధించిన మనోవర్తి, విడాకుల చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. మహిళలు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

చాగల్లు(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, లైంగిక వేధింపులకు గురిచేసిన పోక్సో చట్టం సహా అనేక చట్టాలు రక్షణ కల్పిస్తున్నాయని శక్తి టీం పోలీసులు (రాజమండ్రి) ఏఎస్‌ఐ గంగాధరరావు హెచ్చరించారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆదేశాల మేరకు మండలంలోని బ్రాహ్మణగూడెం జీడీపీ హైస్కూల్‌లో బాలికలకు శక్తి టీం పోలీసులు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.



మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు



బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

రైతు అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



నందమూరులో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు25(ఆంధ్రజ్యోతి): రైతు అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం నందమూరులో రైతన్నసేవలో-అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి కీ వెళ్లి రైతు కుటుంబాలను కలుసుకుని పథకం ప్రయోజనాలు, అర్హతలు, రైతులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతన్న సేవలో-అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కరపత్రాలను పంపిణీ చేసి, రైతుల ఖాతాలో సొమ్ము జమ అయినదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు క్షేమమే ప్రభుత్వానికి ప్రాధాన్యమన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మండల టీడీపీ అధ్యక్షుడు బేతిన నారాయణ, కంటిపూడి శ్రీనివాస్, నందిగం సుధాకర్, కంటిపూడి గోపీచంద్. సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ పాల్గొన్నారు.

రైతులందరికీ ప్రభుత్వం అండ

పెరవలి(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎవరూ అధైర్య పడవద్దని కూటమి నాయకులు విజ్ఞప్తి చేశారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో కూటమి నాయకులు రైతుల వద్దకు వెళ్లి ప్రభుత్వ కార్యాక్రమాలు ప్రచారం చేస్తున్నారు. కాకరపర్రులో కూటమి నాయకులు, ప్రభుత్వ సిబ్బంది గ్రామంలో రైతులను కలుసుకుని రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వో మమత, ఉద్యాన సహాయకురాలు రోషిణి, కూటమి నాయకులు సీతారామయ్య, సంగీత నాగరాజు, సొసైటీ అధ్యక్షులు పెన్మత్స మధు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవరపల్లిలో రైతులకు రైతన్న మీకోసం పత్రాలు అందజేసి రైతులకు సంక్షేమ కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు మాట్లాడుతూ అన్నదాతసుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో ఇప్పటికి 14వేలు జమ చేసిందన్నారు. సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు రెండువిడతలుగా 14వేలు జమ చేశారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖాధికారులు భవాని, సురేఖ, భార్గవి, వెంకన్నబాబు, నవీన్‌కుమార్, ఉపాధి హామీ పీవో శ్రీనివాస్, రైతులు కాశీవిశ్వనాథం, సుంకర భాస్కరరావు, యలమాటి అక్కిరాజు, పాల్గొన్నారు.





కాకరపర్రు, దేవరపల్లిలో రైతులకు రైతన్న మీకోసం పత్రాలు అందజేస్తున్న అధికారులు

నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలి

కొవ్వూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు బంగం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద లేబర్‌కోడ్ పత్రాలను దహనం చేసి నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలుచేశారు. సుందరబాబు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ నిబంధనలతో తక్కువ కాల వ్యవధితో కార్మికులను నియమించడం సరికాదన్నారు. ఈ ప్రక్రియ వలన కష్టపడిన కార్మికులకు పించను, గ్రాట్యూటీ, ప్రమోషన్లు లభించవన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు చట్టపరిధిలో లభించే హక్కులు హరించబడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి రాజేష్, వడ్డాది శ్యామ్, పూజారి వాసు, కారింకి దుర్గాప్రసాద్, మీసాల శంకర జ్యోతి, మీసాల వరలక్ష్మి, అల్లం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని పత్రాలను దహనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంవద్ద మంగళవారం సాయంత్రం షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం, నిరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వ రస్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు

చాగల్లు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లు సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామివా రి కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ, పండిత పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. ప్రత్యే పూజలు అనంతరం బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

సర్వాంగసుందరంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

గోపాలపురం(ఆంధ్రజ్యోతి): షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని మండలం లోని ఆయా గ్రామాల్లో ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. మండలంలోని చెరుకుమిల్లి, దొండపూడి, హుకుంపేట, జగన్నాధపురం, గోపాలపురం, చిట్యాల గ్రామాల్లో ఉన్న ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, తా గునీటి వంటి వసతులు ఏర్పాటుచేశారు. అదేవిధంగా ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో జెయింట్‌వీల్, డిస్కోవీల్ వంటి ప్రత్యేక ఆకర్షణ కోసం ఏర్పాటు చేశారు.



గోపాలపురంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



సుబ్బారాయుడు షష్ఠికి బిక్కవోలు వెళ్లొద్దాం రండి

• షష్ఠి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు
• ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణలు

బిక్కవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుబ్బారాయుడి షష్ఠి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది బిక్కవోలు. ఇక్కడే జరిగే ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం షష్ఠి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 1.10గంటలకు తీర్థపు బిందె సేవతో ఉత్సవాలను ప్రారంభించి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. ఉదయం 8.20 గంటలకు మయూర వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుపుతారు. మధ్యాహ్నం 4 నుంచి 5గంటల వరకూ బాణసంచా కాలుస్తారు. రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలు, బ్యాండు కచేరీలు, శక్తి వేషాలు ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంట ల నుంచి తెల్లవారే వరకు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బాణసంచా కాలుస్తారు. షష్ఠి సందర్భంగా బిక్కవోలు వంతెన వద్ద రామాలయం నుంచి సినిమాహాలు సెంటరు వరకు విద్యుద్దీపాలంకరణ చేశారు. అరపలతో రంగురంగుల ఎల్‌ఈడీ బల్బులతో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కళావేదిక డెకరేషన్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తోంది. ఆలయ పరిసరాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. గురువారం మధ్యాహ్నం 1.17గంటలకు రథోత్సవం జరుగుతుంది. బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. డిసెంబరు 1న ఏకహం, 2న భారీ అన్నదానంతో ఉత్సవాలు ముగిస్తాయి. షష్ఠిఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300మందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

జీడిపప్పు పరిశ్రమ ఇబ్బందులను పరిష్కరించాలి

• ఎమ్మెల్యే మద్దిపాటికి వినతిపత్రం అందించిన వ్యాపారులు

నల్లజర్ల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): జీడిపప్పు పరిశ్రమ ఇబ్బందులను పరిష్కరించాలని నల్లజర్ల మండల జీడిపప్పు వ్యాపారులు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో మంగళవారం కలిసి విన్నవించారు. కాజుపై సెస్ తొలగించాలని, మిషనరీపై సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ కల్పించాలన్నారు. వైజాగ్ పోర్టులో ఇన్‌పోర్టు అవుతుంటే ఆలస్యం అవుతుందని దీనిపై తగుచర్యలు తీసు కోవాలన్నారు. నియోజకవర్గంలో కాజు క్లస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కాజు పోర్టు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై సీఎంతో మా ట్లాడి సమ స్యలు పరిష్కరిస్తానని సాను కూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల మండల యూనియన్ ప్రెసిడెంట్ గుంటముక్కల వెంకట సుబ్బారావు, కార్యదర్శి ఇడపాలపాటి ఉదయ్, మహర్షి, వేణు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటికి జీడిపప్పు పరిశ్రమ సమస్యలను వివరిస్తున్న వ్యాపారులు

పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి

పెరవలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐదుసంవత్సరాలలోపు పిల్లలందరికీ రాబోయే పది రోజుల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఎత్తు, బరువు గుర్తించాలని పెరవలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ మంగళవారం కన్వర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేశామని ఈమీటింగ్‌కు క్షేత్రస్థాయిఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

నిడదవోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘం ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా రూ.131 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పురపాలక సంఘ అధికార్లు శ్రీకారంచుట్టారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ, 27న గురువారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖా మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు.



దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

దేవరపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం గొల్లగూడెంలో గల భారతీ ది వ్యాంగుల ఆశ్రంలో మంగళవారం యర్నగూడెం గ్రామానికిచెందిన దాత నరహరశెట్టి గాంధీ వృద్ధులకు, దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. ఆశ్రం నిర్వాహకుడు కాగిత భాస్కరరావు దాతను అభినందించారు. పుట్టా జగన్మోహనరావు, రవీంద్ర,సతీశ్, పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

చాగల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఊనగట్ల జడ్పీ హైస్కూల్‌లో దాత, మహిత గ్రూప్ అధినేత కాగిత సురేష్‌కుమార్ (హైదరాబాద్) సహకారంతో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో దేశనాయకులు విగ్రహాలు ఏర్పాటుచేయడం అభినందనీయం అన్నారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్య క్షుడు బొల్లిన శివనాగేంద్ర, ఎస్‌ఎంసీ చైర్మన్ కా మన శివ, ప్రధానోపాధ్యాయులు రమణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

నిడదవోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుడిని కోల్పోయి బాధలో ఉన్న వారికి ప్రమాద బీమా ద్వారా ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుం బానికి మేమున్నామనే భరోసా కల్పిస్తోంది. జనసేన పార్టీ నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన జనసైనికుడు కోట రామచంద్రరావు అక్టోబరు 30న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు ఐదు లక్షల రూపాయల బీమా చెక్కును అందించినట్లు అట్లపాడు జనసేన పార్టీ నాయకుడు కృష్ణకుమార్ తెలిపారు.



మంగళగిరిలో జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగేంద్రబాబు

స్మార్ట్ రైస్ కార్డులు అందరూ తీసుకోవాలి

• తహసీల్దార్ కృష్ణారావు
• నల్లజర్ల మండలంలో సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారావు

నల్లజర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రైస్‌కార్డులు తీసుకొని వారు నవంబరు 30వ తేదీలోపు ఆయా గ్రామ సచివాలయాలవద్ద తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణారావు అన్నారు. మంగళవారం నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ఇప్పటి వరకు 30వేల టన్నుల ధాన్యం కొనుగోలుచేసి రైతు లకు తమ ఖాతాలో 19కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా డిసెంబరు నెల నుంచి రేషన్ డిపోలవద్ద రూ.10, రూ.20 టీపొడి ప్యాకెట్స్ అందు బాటులో ఉంటాయన్నారు. ముసుళ్ళకుంట సర్పంచ్ నందమూరి శారదదేవి మాట్లాడుతూ 104 వాహనం గ్రామాల్లోకి వచ్చిన వాహనంలో మందులు ఉండడం లేదని, దీని ద్వారా ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండడం లేదన్నారు. దీనిపై డాక్టర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఈనెల మందులు తక్కువగా వచ్చా యని, ఉన్న మందులనే ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. చీపురుగూడెం సర్పంచ్ గాలింకి మల్లిక గ్రామంలో డ్రైనేజీ పూడికలు, పారిశుధ్యం పనులు తప్ప మిగిలిన పనులు ఉండడం లేదన్నారు. ఎంపీ డీవో సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ పవన్ మాట్లాడుతూ దూబచర్లలో రూ.15లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు, ఉపాధి పథకంద్వారా రూ.7కోట్లతో సీపీ రోడ్లు, చోడవరంలో రూ.10లక్షలతో కమ్యూనిటీ హాలు, అనాథ పిల్లలకు 25లక్షలతో హాస్టల్ ఆదునీకరణ పనులు చేసేందుకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. నల్లజర్ల, పోతరం సొసైటీ చైర్మన్లు రావూరి వెంకటరమణ, పసుమర్తి ప్రభాకరావు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, ఏవో సోమశేఖర్, వైస్ ఎంపీపీ శివాజీ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

• 8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు



కంసాలిపాలెంలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

నిడదవోలు, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామశివారులో మంగళవారం పేకాడుతున్నారన్న సమాచారం మేరకు సమిశ్రగూడెం ఎస్‌ఐ బాలాజీ సుందరరావు తన సిబ్బందితో దాడిచేశారు. ఈదాడిలో 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.7870 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాడపల్లిలో ముగ్గురి అరెస్టు

కొవ్వూరు(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలోని బంగారంపేటకాలనీ పంటపొలాల పశువులపాకలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మంగళవారం పట్టణ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ.2200లనగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ఉండ్రాజవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తణుకు వెళ్లే రోడ్డులో పాలంగి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరుకు మించి ప్రయాణిస్తే తప్పనిసరిగా జరిమానాలు విధిస్తామని ఎస్‌ఐ రవికుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా త్రిబుల్ రైడింగ్ చేస్తున్నవారికి, వాహనానికి సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో జరిమానాలు విధించారు.

